సహాయ కేంద్రాల ఏర్పాటు

జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసింది. అత్యవసర సమయాల్లో సేవల నిమిత్తం సంప్రదించాలని ప్రజలకు సూచనలిచ్చింది.

కలెక్టరేట్- 9491077356, 08572-242777
చిత్తూరు ఆర్డీవో కార్యాలయం- 9491077011
కుప్పం 9966072234
పలమనేరు 9491074510
నగరి 9701019083

జిల్లా యంత్రాంగం సన్నద్ధం

☛ 3 రోజుల పాటు అధికారులు, ఉద్యోగులకు సెలవుల్లేవు

☛ రెవెన్యూ, విద్యుత్తు డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. అధికారులు, ఉద్యోగులు కార్య క్షేత్రంలోనే అందుబాటులో ఉండాలని ఆదేశాలిచ్చింది.

తిరుమలలో వర్షం



తిరుమల, న్యూస్‌టుడే: అల్పపీడనం నేపథ్యంలో తిరుమలలో సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షం ప్రారంభమైంది. దశలవారీగా కురుస్తున్న వర్షంతో భక్తులు తడిసి ముద్దయ్యారు. చలితీవ్రత పెరిగింది. మరో మూడు రోజులపాటు వర్షాలు కురవనుండటంతో తితిదే అధికారులు అప్రత్తమై ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

విపత్తు నివారణకు ముందస్తు వ్యూహం

■ ఆదివారం రాత్రి నుంచే వర్షం

అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. తవణంపల్లె మండలంలో 24.2 మి.మీ., రామకుప్పం 22.4, నింద్ర 18.6, ఐరాల 17.8, విజయపురం 17.2, నగరి, కార్వేటినగరం 16.8, శాంతిపురం 15.2, పాలసముద్రం 14.4, పూతలపట్టు 13.6, పులిచెర్ల, యాదమరి 13.2, గుడిపాల 11.8, గంగాధరనెల్లూరు 11, చిత్తూరు రూరల్ 10.8, సోమల 10.4 మి.మీటర్లు నమోదైంది.



ఇంజినీర్లతో సమీక్షిస్తున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

పది డివిజన్లలో 11 సహాయ కేంద్రాలు: ఎస్‌ఈ

చిత్తూరు (మిట్టూరు): వర్షాలకు విద్యుత్తు ప్రమాదాల నివారణకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఈ సురేంద్రనాయుడు పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయంలో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో సర్కిల్ కార్యాలయంలో పాటు పది డివిజన్ కార్యాలయాల్లో 11 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, సిబ్బంది వారివారి ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని, ప్రమాదకర స్తంభాలు, వైర్లు మార్చాలని చెప్పారు. కడప, అనంతపురం జిల్లాల నుంచి వంద సింగిల్ ఫేజ్ నియంత్రికలు తెప్పించామన్నారు. అనుబంధ పరికరాలు ఉన్నాయని, సెక్షన్‌కు వంద చొప్పున స్తంభాలు సిద్ధంగా ఉంచామన్నారు.

■ కలెక్టరేట్‌లో నేటి గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ మణికంఠతో కలిసి.. జిల్లా, మండల అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. 'కలెక్టరేట్‌లో మంగళవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నాం. 15, 16 తేదీల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించాం. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. అత్యవసర సేవల నిమిత్తం 94910 77356 నంబరును సంప్రదించాలి. పంట, పశు నష్టం వాటిల్లకుండా రైతుల్ని అప్రమత్తం చేయాలి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఎస్పీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టాలి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలి. శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసిస్తున్న వారిని గుర్తించి, పునరావాస కేంద్రాలకు తరలించాలి. పురపాలక, పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలి. విపత్తు నిర్వహణకు అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని' ఆదేశించారు. పీఆర్ ఎస్‌ఈ శంకర్‌నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయకుమార్, డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, డీఈవో దేవరాజు, ఇతర అధికారులు ఉన్నారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: తుపాను ప్రభావం నేపథ్యంలో జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించామని డీఈవో దేవరాజు సోమవారం తెలిపారు. తుపాను కారణంగా పాఠశాలలకు నష్టం వాటిల్లితే వెంటనే సంబంధిత ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష కార్యాలయాలకు సమాచారం అందజేయాలని ఆదేశించారు.

వైద్యులకు మూడ్రోజులు సెలవుల రద్దు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో తుపాను కారణంగా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తమై ప్రజలకు అందుబాటులో ఉండాలని, మూడ్రోజుల పాటు ఎవరికీ సెలవులు లేవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జూమ్ సమావేశం ద్వారా ఆమె వైద్యాధికారులతో మాట్లాడారు. పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర శాఖలతో కలిసి పనిచేయాలని, ఇంటింటి సర్వే చేపట్టి అనారోగ్య సమస్యలు గుర్తించాలని చెప్పారు. అతిసార, డయేరియా కేసులు పెరగకుండా చూసుకోవాలని, అధిక కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు హర్షవర్ధన్, అనిల్, జార్జి పాల్గొన్నారు.

విద్యుత్ సేవలకు అంతరాయం లేకుండా..

వర్షాల కారణంగా విద్యుత్తు ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖ సూచనలిచ్చింది. ఆయా సమస్యలపై 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొంది. విద్యుత్తు సేవలకు అంతరాయం లేకుండా పర్యవేక్షించేందుకు బృందాల్ని సన్నద్ధం చేసింది. డివిజన్ కార్యాలయాల వారీగా కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేసింది.

చిత్తూరు టౌన్ డివిజన్- 94408 17419
పుత్తూరు డివిజన్- 81437 73436
చిత్తూరు రూరల్ డివిజన్- 94910 52934
పుంగనూరు డివిజన్- 80740 51992

24 గంటల్లో వర్షపాతం ఇలా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు. . తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదైంది. పులిచెర్లలో 9.4 మి.మీ, ఎస్ఆర్‌పురం 8.6, సదుం 6.2, పుంగనూరు 6.2, సోమల 5.6, చౌడేపల్లె 5.4, రామకుప్పం 5.2, పెద్దపంజాణి 4.6, బైరెడ్డిపల్లె 3.6, శాంతిపురం 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

● రహదారుల వెంట వర్షాలతో చెట్లు విరిగిపడటం కారణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా నివారణకు చర్యలు చేపట్టారు. నష్టాలు ఏర్పడిన చోట్ల క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికార యంత్రాంగం ఆదేశాలిచ్చింది.

తుక్కులోనూ తినేశారు!

● సాంఘిక సంక్షేమ శాఖలో అధికారి అవినీతి బాగోతం

● ఇనుము, అల్యూమినియం తక్కువ ధరకే కట్టబెట్టిన వైనం

ఈనాడు, చిత్తూరు: కాదేదీ కవితకు అనర్హం. . అన్నది సామెత. సాంఘిక సంక్షేమ శాఖలోని ఓ అధికారి దీన్ని మరోలా మార్చుకున్నారు. వసతిగృహాల్లోని తుక్కునూ తక్కువ ధరకే కట్టబెట్టి అయిన కాడికి దండుకున్నారు. అది కూడా పొరుగున ఉన్న జిల్లాకు చెందిన వ్యక్తికి టెండరు దక్కడం అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారి ఇదే ప్రశ్నను లేవనెత్తగా స్థానికులెవరూ పెద్దగా ముందుకు రాలేదని తెలివిగా జవాబు ఇచ్చినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. సదరు అధికారి అవినీతి బాగోతమూ బయటకు వస్తుంది.

జిల్లావ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 41 ప్రీ మెట్రిక్ పాఠశాల, 16 కళాశాల వసతిగృహాలున్నాయి. విద్యార్థులకు వంట చేసేందుకు ప్రభుత్వం నుంచి గ్రైండర్లు, గ్యాస్ సిలిండర్లు, అల్యూమినియం, స్టీలు పాత్రలు సరఫరా చేస్తారు. అదేవిధంగా పిల్లలకు ట్రంకు పెట్టెలు ఇస్తారు. గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు, విద్యుత్తుకు



సంబంధించిన వస్తువులు, ఇనుప సామగ్రి, టెలివిజన్లు, బరువు తూచే యంత్రాలు తదితరాలు ఉంటాయి. కొంతకాలం తర్వాత ఇవి వినియోగానికి పనికిరావు. అప్పుడు ఈ తుక్కు సామగ్రిని గుజిరి వ్యాపారులకు విక్రయిస్తారు.

■ విజయా డెయిరీ తుక్కునే కొన్న చిత్తూరు వ్యాపారులు!

చిత్తూరు జిల్లాలో గుజిరీ వ్యాపారం చేసే వ్యక్తులు లేరా? వారెందుకు ముందుకు రాలేదని ఉన్నతాధికారి సదరు అధికారిని అడగ్గా ఎక్కువ ధరకు కోట్ చేశారని, ఎక్కువ మంది ముందుకు రాలేదని చెప్పారు. గతేడాది విజయా డెయిరీలో రూ.కోట్లు విలువ చేసే తుక్కునే చిత్తూరు నగరంలోని వ్యాపారులు పోటీ పడి కొన్నారు. అటువంటప్పుడు ఇప్పుడు ముందుకు రాలేదని చెప్పడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తిరుపతివాసితో ఎక్కువ ధరకు వేయించి

తక్కు సామగ్రి విక్రయించేందుకు అక్టోబరు 1న టెండర్లు పిలిచారు. 5వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో టెండరు ఫారాలు పొందవచ్చని ప్రకటన ఇచ్చారు. 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు వాటిని సమర్పించాలని పేర్కొన్నారు. అక్టోబరు 8న సాయంత్రం 4 గంటలకు జేసీ సమక్షంలో టెండర్లు తెరుస్తారని తెలిపారు. ఇక్కడే సాంఘిక సంక్షేమ శాఖలోని అధికారి చక్రం తిప్పారు. తన ఆదేశాలను పాటించే తిరుపతిలోని ఒకరితో కొంత ఎక్కువ ధరకు టెండరు వేయించారు. పలువురు వచ్చినా తిప్పి పంపినట్లు సమాచారం.

కిలో ట్రంకు పెట్టె బయట రూ.29.. టెండర్‌లో రూ.11కే

చిత్తూరు నగరంలోని గుజిరీ వ్యాపారులు ట్రంకు పెట్టెలు కిలో రూ.29, గ్యాస్ స్టవ్ కిలో రూ.80, సీలింగ్ ఫ్యాను రూ.28, స్టీల్ పాత్రలు రూ.40, అల్యూమినియం వస్తువులు రూ.100, టెలివిజన్ రూ.30, ప్లాస్టిక్ వస్తువులు కిలో రూ.16కు కొనుగోలు చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖలోని తుక్కును కొనేందుకు తిరుపతి నుంచి వచ్చిన వ్యక్తి మాత్రం ట్రంకు పెట్టె కిలో రూ.11, గ్యాస్ స్టవ్ కిలో రూ.15, అల్యూమినియం రూ.70, టెలివిజన్ కిలో రూ.3 ఇలా టెండరు దాఖలు చేయగా దాన్నే ఖరారు చేయడం గమనార్హం. ఆ శాఖలోని అధికారే ఇందులో కీలక పాత్ర పోషించారు. ఇందుకుగాను రూ.లక్షల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది.

అదృష్టం వరించింది



లక్కీడిప్‌లో తీసిన కాయిన్ చూపుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఎస్పీ, ఎక్సైజ్ అధికారులు

☛ 14 మంది మహిళలకు దుకాణాలు

☛ రాత్రే వ్యాపారులకు ప్రొవిజినల్ లైసెన్సులు

☛ రేపటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల కోసం పోటీపడిన 2,266 మందిలో 104 మందిని అదృష్టం వరించింది. రాజకీయ నాయకులు, పాత వ్యాపారులే కాక కొత్తవారు సైతం పోటీపడ్డారు. తెలుగు రాష్ట్ర ప్రజలే కాకుండా, తమిళనాడు, కర్ణాటక ప్రజలు అదృష్ట పరీక్షలో పాల్గొన్నారు. 14 మంది మహిళలు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. చిత్తూరు నగరం సంతపేటలోని ఆర్.ఆర్.గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ అదృష్ట పరీక్ష (లక్కీడిప్) ప్రారంభించారు. చిత్తూరు నగరంలోని మొదటి దుకాణానికి అదృష్ట పరీక్ష ప్రారంభం కాగా.. ప్రసన్నకుమార్ అనే వ్యక్తికి చెందిన 5వ టోకన్‌కు అదృష్టం తగిలింది. పాలసముద్రం దుకాణానికి 82 మంది పోటీపడగా.. వాసు అనే వ్యక్తికి చెందిన 40వ టోకన్‌కు అదృష్టం వరించింది. ఇలా మొదటి దుకాణం నుంచి 104వ దుకాణం వరకు కలెక్టర్ ఆధ్వర్యంలోనే నిర్వహించారు. ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. ప్రతి దుకాణానికి ముగ్గురిని ఎంపిక చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు అదృష్ట పరీక్ష జరగ్గా.. దరఖాస్తుదారులతో సంతపేట మార్గం కిక్కిరిసింది. కార్లతో రోడ్డు మొత్తం నిండిపోగా పోలీసులు ట్రాఫిక్ మళ్లించి సమస్య పరిష్కరించారు.

■ సమకూరిన ఆదాయం..



లాటరీలో దుకాణం దక్కించుకున్నవారు ప్రభుత్వానికి సొమ్ము చెల్లిస్తూ..

దుకాణాలు దక్కించుకున్న వారికి రాత్రికే అధికారులు ప్రొవిజినల్ లైసెన్సులు అందించారు. లైసెన్సు ఫీజు 104 దుకాణాలకు రూ.70.62 కోట్లు ఉండగా ఒక్కో దుకాణానికి ఆరో వంతులో భాగంగా సోమవారం ప్రభుత్వానికి రూ.10.69 కోట్లు సమకూరింది. దుకాణదారులకు మద్యం కొనుగోలుకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు ఇచ్చారు. ఒరిజినల్ లైసెన్సుల కోసం వ్యాపారులు దుకాణాలను బడి, గుడికి 100 మీటర్ల దూరం తరవాత ఏర్పాటు చేసి, బ్యాంకు గ్యారెంటీ, ఇతర పత్రాలు సమర్పించాలి. జిల్లాలో ప్రైవేటు దుకాణాలు 16 నుంచే ప్రారంభం కానున్నాయి. వీటిని దక్కించుకున్న వారు ఇప్పటికే స్థలాన్వేషణలో ఉన్నారు. మంగళవారం అన్ని దుకాణాలకు మద్యం నిల్వలు అంది బుధవారం నుంచి వ్యాపారం ప్రారంభం కానుంది.

మహిళలను వరించిన అదృష్టం

చిత్తూరులోని ఆర్.ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన లాటరీలో రామకుప్పానికి చెందిన ధనలక్ష్మిని అదృష్టం వరించింది. వ్యవసాయం చేసుకునే ధనలక్ష్మి, తన భర్తతో కలిసి చెరో దరఖాస్తు చేశారు. అందరిలోనూ.. ఆమెకు కేటాయించిన నంబరు లాటరీలో తగిలింది. అయితే మద్యం వ్యాపారం గురించి ఆమెకు ఏమీ తెలియకపోవటంతో భర్తతో సహచర వ్యాపారులు అక్కడే మంతనాలు చేస్తుండటాన్ని ఆమె ఆసక్తిగా గమనిస్తూ ఉండిపోయారు. ఇలా పలువురు మహిళలు లాటరీలో పాల్గొని తమ అదృష్టాన్ని పరీక్షించుకుని విజయం సాధించారు.



మద్యం దుకాణాలు దక్కించుకున్న ధనలక్ష్మి(రామకుప్పం), కీర్తన(చిత్తూరు), ఎస్.లక్ష్మి(ఐరాల)

సిండికేట్ దందా..



హాజరైన దరఖాస్తుదారులు

మద్యం దుకాణాల అదృష్ట పరీక్షలోనే సిండికేట్ దందా తారసపడింది. కర్ణాటక రాష్ట్రం నంగిలికి చెందిన ఓ వ్యక్తి పలమనేరు దుకాణంతో పాటు మరికొన్ని దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నాడు. అదృష్ట పరీక్షలో అతడి టోకన్‌కు అదృష్టం వరించింది. అయితే.. పలమనేరులో సిండికేట్ అయిన కొందరు నంగిలి దరఖాస్తుదారుని అడ్డుకుని ఆ దుకాణాన్ని తమకు ఇచ్చేయాలని, వాటి లైసెన్సు ఫీజు తాము ఇస్తామని చెప్పారు. లైసెన్సు ఫీజు చెల్లించడానికి కూడా అతడిని వదలకపోవడంతో చివరకు పోలీసుల సాయంతో అతడే ఆ దుకాణాన్ని కైవసం చేసుకున్నాడు. గుంపులుగా దరఖాస్తు చేసుకున్న వారికే దుకాణాలు సొంతమయ్యాయి.

మద్యం టెండర్లలో తెదేపా నాయకునికి బెదిరింపులు

ఈనాడు, చిత్తూరు: బంగారుపాళెం మండలం 170.గొల్లపల్లె సర్పంచి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడుకు వి.కోటలోని పలువురి నుంచి లాటరీ ప్రక్రియకు ముందు ఫోన్‌లో బెదిరింపులు ఎదురయ్యాయి. బంగారుపాళ్యం నుంచి వచ్చి వి.కోటలోని మద్యం దుకాణాలకు ఎలా దరఖాస్తు చేశావని బూతులతో విరుచుపడ్డారు. తమకు కాదని ఎలా దుకాణాలు నడుపుతావో చూస్తామని హెచ్చరించారు. ఆయన కూడా అదే స్థాయిలో బదులిచ్చారు. మద్యం దుకాణల టెండర్లను ఎక్కడి వారైనా టెండర్లు వేయవచ్చని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని కోకా ప్రకాశ్‌నాయుడు గుర్తుచేశారు. మూడు దుకాణాలకు ఆయన టెండరు వేయగా లాటరీలో ఒక్క దుకాణం కూడా దక్కలేదు. అయితే ఫోన్‌కాల్ సంభాషణ చరవాణిలో వైరల్‌గా మారింది.

పల్లెల అభ్యున్నతే ప్రభుత్వ ఆశయం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధి, పల్లె ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెదేపా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు గ్రామీణ మండలంలో ముత్తుకూరు, అనంతాపురం, అనగల్లు, పాలూరు, దిగువమాసాపల్లె పంచాయతీల్లో ఎమ్మెల్యే జగన్మోహన్ సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రన్న, డిప్యూటీ సీఎం పవనన్న పల్లెలతోనే ప్రగతి సాధ్యమనే నినాదంతోనే పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, వైద్యం, విద్య, ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేస్తారన్నారు. ఐదు పంచాయతీలకు 9 సీసీరోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు విడుదల చేస్తున్నట్లు హామీ ఇచ్చి భూమిపూజ చేశారు. తెదేపా జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, జగదీశ్వర్‌నాయుడు, శశికర్‌బాబు, రఘు, మేషాక్, కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఏటీజీహెచ్ వరకు వేచిఉన్నారు. వీరికి దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని రూ.86,900 మంది దర్శించుకోగా.. రూ.2.56 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

ఎంపీ లాడ్స్ వినియోగంలోనూ అదే నిర్లక్ష్యం!

● వైకాపా హయాంలో రూ.7.7 కోట్లు మాత్రమే ఖర్చు

● పెండింగ్ పనులు, నిధుల వినియోగంపై కూటమి సర్కార్ దృష్టి

ఈనాడు, చిత్తూరు: గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేయాలని వైకాపా హయాంలో పదేపదే ప్రజల నుంచి వినతులొచ్చినా అయిదేళ్లు బుట్టదాఖలు చేశారు. కొన్నింటికి అరకొరగా విదల్చడంతో గుత్తేదారులు అర్థాంతరంగా పనులు అటకెక్కించారు. ఎంపీ లాడ్స్ విషయంలోనూ ఇలాగే వ్యవహరించడంతో అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడికక్కడ ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కార్ ఇప్పుడు వీటిపై దృష్టి పెట్టింది.

పార్లమెంట్ సభ్యులు ఆయా నియోజకవర్గాల పరిధిలో వివిధ పనులు చేపట్టేందుకు ఎంపీ లాడ్స్ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.5 కోట్ల చొప్పున అందజేస్తుంది. కరోనా నేపథ్యంలో 2020లో నిధులు విడుదల కాలేదు. 2021లో రూ.2 కోట్లు ఇచ్చారు. మొత్తంగా 17వ లోక్‌సభలో ఐదేళ్లకుగాను ఒక్కో ఎంపీకి రూ.17 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో చిత్తూరు ఎంపీగా ఉన్న రెడ్డెప్ప వీటిని రహదారులు, తాగునీరు, డ్రెయిన్లు, విద్యుత్తు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, సామాజిక భవనాల నిర్మాణం వంటి పనులు చేసేందుకు ఖర్చు చేయాలి. కలెక్టర్‌కు ఆ ప్రతిపాదనలు పంపితే ఆయన ఆమోదించిన తర్వాత మొదలుపెట్టాలి. రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిపై చేపట్టవచ్చు.

కుప్పంలో ఆర్భాటాలతో సరి

గత ముఖ్యమంత్రి జగన్ కుప్పాన్ని పులివెందులతో సమానంగా చూస్తానని పలుమార్లు వైకాపా నాయకులు, ప్రజలకు చెప్పారు. ఇక్కడ రూ.3.73 కోట్లు కేటాయించినా రూ.2.02 కోట్లకు సంబంధించిన పనులు మొదలేపెట్టలేదు. రూ.24 లక్షలతో రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో మూడు పనులు పూర్తి చేశారు.

■ 116 పనులకు నిధులొచ్చినా..

2019- 2024 మధ్య అప్పటి ఎంపీ రెడ్డెప్ప ఐదేళ్ల వ్యవధిలో రూ.7.7 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 116 అభివృద్ధి కార్యక్రమాలకు రూ.6.04 కోట్లు మంజూరైనా పనులు సాగలేదు. రూ.3.26 కోట్లు ఇప్పటికీ ఎంపీ లాడ్స్ ఖాతాలోనే ఉన్నాయి. రూ.3.76 కోట్లతో ప్రతిపాదించిన 35 పనులు పురోగతిలో ఉన్నాయి. 21 పూర్తయినా రూ.1.50 కోట్ల వరకు బిల్లులు చెల్లించలేదు.

వైకాపా హయాంలో నిధులొచ్చినా ప్రారంభించని పనులు: 116
అంచనా వ్యయం: రూ.6.04 కోట్లు
పురోగతిలో ఉన్న పనులు: 35
వీటి వ్యయం: రూ.3.76 కోట్లు

త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్, ప్రస్తుతం ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇటీవల సమీక్షించారు. గతంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అప్పుడు మంజూరైన నిధులు ఇప్పుడూ వినియోగించుకునే సౌలభ్యం ఉన్నందున పాత బిల్లులు ఉంటే అప్‌లోడ్ చేయాలని, సీసీ రోడ్లు, సామాజిక భవనాలు, ఆర్వో ప్లాంట్ల పనులు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుత ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు రూ.1.69 కోట్లతో ప్రతిపాదించిన 37 పనులపైనా శ్రద్ధ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు.






లాభదాయకంగా పచ్చిమిర్చి

కోట, న్యూస్‌టుడే: అన్నదాతలు పంట మార్పిడి విధానం ద్వారా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా అన్ని సీజన్లలో డిమాండ్ ఉండే అత్యంత ఖరీదైన పచ్చిమిర్చి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. 50శాతం వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. కోట మండలంలోని వెంకన్నపాళెం, తిన్నెలపూడి, గూడలి, రంగన్నగుంట, కేశవరం, చిట్టేడు పరిసర ప్రాంతాల్లో పచ్చిమిర్చి సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు, ఆదాయాలు పొందుతున్నారు.

సాగు విధానం: పచ్చిమిర్చి ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేస్తారు. ఇసుక, బంకమట్టి నేలల్లో సాగు చేయవచ్చు. అధికమైన తేమను తట్టుకోలేదు. భారీ నీటి పారుదల వల్ల ఏపుగా పెరుగుదల ఉండదు, పువ్వులు రాలిపోతాయి. మొత్తంగా రెండు పర్యాయాలు దుక్కి దున్నాలి. తరువాత దుక్కిలో ఎకరాకు 100 కిలోల డీఏపీ, పశువుల పేడను ఎరువుగా వేసుకోవాలి. అవసరం మేరకు మందులు పిచికారీ చేయాలి.




రక్షణ చర్యలు: ప్రొద్దుటూరుకు చెందిన మిరప నారును ఎకరాకు వెయ్యి మొలకలు వేయాలి. రెండు అడుగుల దూరానికి ఒక మొలక నాటాలి. వారం రోజుల తరువాత మొలకలు వస్తాయి. కలుపు రాకుండా చూసుకోవాలి. నెల రోజులకు మొదటి విడత కాపు వస్తుంది. అందులో 700 నుంచి 800 కిలోల వరకు వస్తాయి. తర్వాత రెండో విడత రెండు వేల కిలోల వరకు వస్తాయి. మూడో విడత 8వేల కిలోల వరకు వస్తాయి. ఒక్కొక్క మొక్క 10 కేజీలకు పైగా దిగుబడిని ఇస్తుంది.

మార్కెట్ విధానం: చెన్నైకు రవాణా చేస్తారు. కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరులోని మార్కెలకు తరలిస్తారు. ప్రస్తుతం కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పలుకుతోంది.

రూ.50వేల ఆదాయం..

ఎకరాలో గతేడాది సాగు చేస్తే రూ.2లక్షల పెట్టుబడి పెట్టా. అమ్మకాల ద్వారా రూ.2.50లక్షల ఆదాయం వచ్చింది. రూ.50వేలు ఆదాయం మిగిలింది. ఈ ఏడాది కూడా సాగు చేస్తున్నాను.



- కస్తూరయ్య, రైతు, వెంకన్నపాళెం



పెరటి సాగుకు తరుణమిదే

పుత్తూరు, న్యూస్‌టుడే: మనం రోజూ తినే ఆహారంలో పోషక విలువల దృష్ట్యా పండ్లు, కూరగాయలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. పెరట్లో పండిన కూరగాయలు కొనుగోలు చేసే వాటి కన్నా తాజాగా, రుచిగా ఉండటంతో పాటు రసాయనాలు ఉండవు. వీటి పెంపకం ప్రతి ఇంట్లో చేపడితే ప్రయోజనమని పుత్తూరు ఉద్యానశాఖాధికారిణి వెంకటసౌజన్య తెలిపారు. ◗ గ్రామాల్లో, పట్టణాల్లో ఖాళీ స్థలాలుంటే అందులో కొంత భాగం ఎంపిక చేసుకుని శుభ్రం చేసి నేలను దున్నుకోవాలి. ◗ టమోటా, వంగ, మిరప, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ లాంటి కూరగాయల నారు నాటుకోవాలి. ◗ బహువార్షిక మొక్కలైన కూర అరటి, నిమ్మ, కరివేపాకు, మునగ తదితర మొక్కలను తోటకు ఉత్తర దిశగా నాటుకోవాలి. వాటి నీడ ఇతర మొక్కలపై పడకుండా ఉంటుంది. ◗ దీర్ఘకాలిక కూరగాయలైన క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పంట మడుల్లో వరుసల మధ్య స్వల్పకాలిక ఆకుకూరలైన పాలకూర, మెంతికూర, కొత్తిమీర, బచ్చలి పెంచుకోవాలి. ◗ పెరటి కంచెపై మూడు వైపులా వేసవి, వర్షాకాలాల్లో కాకర, బీర, సొర, నేతిబీర, దోస, పొట్ల వంటి తీగజాతి పాదులు, శీతాకాలంలో చిక్కుడు, బఠాణీలు నాలుగోవైపు పెంచుకోవాలి. తోటల్లోని అన్ని పంటలకు అవసరాన్ని బట్టి నీరు పెట్టి కంపోస్టు ఎరువులు వేస్తూ ఉండాలి.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం నాటిన 30 నుంచి 40 రోజుల లోపు గత సంవత్సరం వెన్ను వచ్చింది. దీనిని అరికట్టాలంటే నారు ఎప్పుడు నాటుకోవాలి?

- మునిరెడ్డి, గాజులమండ్యం

జవాబు: నవంబర్ 15 తరువాత నారు విత్తుకొని డిసెంబర్ 10 తరువాత వరి నాట్లు వేసుకున్నట్లయితే వెన్ను అనుకున్న సమయానికి వస్తుంది. దీనివల్ల యాజమాన్య ఖర్చులు తగ్గి పంట దిగుబడి అధికంగా వస్తుంది. - సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట మండలం


రైతేరాజు

వర్షా కాలం.. సంరక్షణ లక్ష్యం

వర్షాలు ప్రారంభం అయ్యే సమయం సమీపించిందని, ఈ పరిస్థితుల్లో మూగజీవాల సంరక్షణ విషయంలో అలక్ష్యం వద్దని శ్రీకాళహస్తి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్‌బాబు తెలిపారు. వరదలు, తుపాన్లు సంభవించినప్పుడు పశుపోషకులు ఈ తరహా జాగ్రత్తలు పాటిస్తే ప్రాణ నష్టం, వ్యాధుల బారిన పడకుండా సంరక్షించుకోవచ్చునని తెలిపారు.

◗ పశువులకు ఇచ్చే నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచాలి. ◗ పశువుల పాకలను తేలికపాటి ఆకులు, కొబ్బరి మట్టలు తదితర వాటితో వేసుకుంటే గాలి తీవ్రతకు అవి కూలిపోయినా పెద్దగా నష్టం ఉండదు. ◗ బాహ్యపరాన్న జీవుల నిర్మూలనకు క్రిమి సంహారక మందులు విధిగా వాడాలి. ◗ నిల్వ ఉన్న నీటిలో దోమలు, ఈగలు పెరిగే ప్రమాదముంది. తద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువ. అలాంటి పరిస్థితులు లేకుండా జాగ్రత్త పడాలి. వీలైనంత వరకు పశువులు ఉన్న ప్రదేశంలో నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ చూపాలి. ◗ రోగ నిరోధక శక్తి తగ్గి పశువులు వ్యాధులకు గురయ్యే అవకాశముంది. పశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలను గుర్తించి అప్పటి కప్పుడు వైద్య సాయం అందించాల్సి ఉంది. ◗ సీజనల్ వ్యాధుల నివారణకు విధిగా టీకాలు వేయించాలి. ◗ ప్రధానంగా దాణా ఇబ్బందులు లేకుండా వర్షాకాలంలో ముందస్తుగా దాచుకోవడం శ్రేయస్కరం.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



అటెండర్‌కే దిక్కులేదట.. ఇక అధికారులు దేవుడెరుగు

- పర్యవేక్షణ లేని పౌరసరఫరాల శాఖ
- ప్రజలకు జవాబుచెప్పే వారు కరవు
- సీఎం సొంత జిల్లాలో అస్తవ్యస్తమైన దుస్థితి



జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

జిల్లా లెక్క ఇదీ..

- 1,379 చౌక దుకాణాలు
- లక్షలు 5.43 తెల్లరేషన్ కార్డులు
- 120 పెట్రోలు బంకులు
- 8 వేల టన్నులు నెలకు ఇచ్చే బియ్యం
- 110 గ్యాస్ సరఫరా ఏజెన్సీలు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పేరుకేమో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లా.. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది చిత్తూరు జిల్లా పౌరసరఫరాల శాఖ దుస్థితి.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థ అవినీతిలో కూరుకుపోయి అస్తవ్యస్తంగా తయారైంది.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ వ్యవస్థ ప్రక్షాళన దిశగా ముందుకెళ్తోంది.. సమూల మార్పులతో పారదర్శక పాలనకు దృష్టి సారించింది.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రక్షాళన జరిగినప్పటికీ సీఎం సొంత జిల్లాలో మాత్రం కనీసం జిల్లా కార్యాలయానికి అటెండరుకు దిక్కులేదు.. అన్ని పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.. ఇదీ చిత్తూరు జిల్లా పౌరసరఫరాల శాఖ దుస్థితి.

సీఎస్‌డీటీ ఒక్కరుంటే ఓట్టు..!

జిల్లాలో 31 మండలాలు ఉన్నాయి. సహాయ పౌరసరఫరాల శాఖ అధికారి(ఏఎస్‌వో) పోస్టులు రెండూ ఖాళీనే. 31 మండలాల్లోనూ సీఎస్‌డీటీ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. మండల స్థాయిలో చౌక దుకాణాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ సిలిండర్ల సరఫరా ఏజెన్సీలు, నిత్యావసర సరకుల ధరల నియంత్రణ, బియ్యం పంపిణీని పర్యవేక్షిస్తూ లబ్ధిదారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత సీఎస్‌డీటీలదే. ఇంత కీలకమైన ఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఈ శాఖ పాలన అస్తవ్యస్తంగా మారింది.

వేతనాలిక్కడ.. ఉద్యోగం మరోచోట

జిల్ల పౌరసరఫరాల శాఖ ద్వారా 60-70 మంది ఉద్యోగులకు వేతనాలు అందుతున్నాయి. వేతనం ఇక్కడ.. ఉద్యోగం మరొకచోట.. ఇక్కడేమో ఉద్యోగుల కొరత.. ఇదీ పౌరసరఫరాల శాఖ దుస్థితి. ఈ శాఖ ద్వారా జీతం పొందుతున్న అధిక శాతం మంది ఉద్యోగులు కలెక్టరేట్, రెవెన్యూ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

ఇవీ సమస్యలు..

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రజాపంపిణీ వీధిన పడింది. పాలనా వ్యవహారాలు పట్టించుకునే వారే లేరు. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక పెట్రోలు బంకుల నిర్వహణ, గ్యాస్ సిలిండర్ల సరఫరాదారుల అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందని వినియోగదారులు వాపోతున్నారు.

నియామకాలెక్కడా..?

గత కొద్ది నెలలుగా సీఎస్‌డీటీల పోస్టులు భర్తీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నప్పటికీ ప్రయోజనం లేదు. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ ఈ పోస్టులను కేటాయించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపడమే తప్ప.. ఒక్కరినీ నియమించిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా రాష్ట్ర అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అటెండరు లేని శాఖ అంటే ఇదే..

ఏ శాఖను పరిశీలించినా.. ఆ శాఖ జిల్లా కార్యాలయంలో అటెండరు తప్పనిసరిగా ఉండాలి. పౌరసరఫరాల శాఖ జిల్లా కార్యాలయంలో కొన్ని నెలలుగా అటెండరు పోస్టు ఖాళీగా ఉంది. పేరుకేమో జిల్లా కార్యాలయం. ఇక్కడ అటెండరు లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే వివిధ శాఖల అధికారులు, ప్రజానాయకులు, అర్జీదారులు ఇదేమి పాలనంటూ మనసులో మథన పడుతుండటం గమనార్హం. ఇక కార్యాలయంలో కంప్యూటర్లు సక్రమంగా పనిచేయవు. ఇంటర్నెట్ కనెక్షన్లు ఉండవు.

ద్రవిడలో ఈ నెల 25 వరకు స్పాట్ అడ్మిషన్లు

కుప్పం గ్రామీణ: ద్రవిడ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ ప్రవేశాలకు కోసం ఈ నెల 25 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వర్సిటీ భాగస్వామ్య రాష్ట్రాల కోటా కింద ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు అందులో వివరించారు.

4నుంచి డీఈఎడ్ పరీక్షలు

చిత్తూరు విద్య: డీఈఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి 11.30గంటల వరకు జరుగుతాయని డీఈవో దేవరాజు సోమవారం తెలిపారు. డీఈఎడ్ మొదటి సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నామని చెప్పారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు(నేరవార్తలు): జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. బాధితుల వినతులను ఎస్పీ, ఏఎస్పీలు స్వీకరించి పరిశీలించి, వారం రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు.

తల్లిదండ్రుల అభీష్టాన్ని నెరవేర్చండి

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు వృత్తిలో ఉత్తమంగా ఎదిగి తల్లిదండ్రుల అభీష్టాన్ని నెరవేర్చాలని స్విమ్స్ సంచాలకులు డా.ఆర్వీ కుమార్ పిలుపునిచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు.. వారి తల్లిదండ్రులతో ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యవిద్యనే కాకుండా వ్యక్తిత్వ వికాసం, మానసిక దృఢత్వం పెంచుకోవాలన్నారు. డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్ల, ప్రిన్సిపల్ ఉషా కళావత్, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు, డాక్టర్ ముక్తేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. ఎస్వీఎంసీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు మాట్లాడారు. ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైద్యులు సునీత, బీఎస్ఎన్ మూర్తి, పాహీం, సుజాత తదితరులు పాల్గొన్నారు.



నూతన విద్యార్థికి తెల్లకోటు అందజేస్తున్న స్విమ్స్ సంచాలకులు ఆర్వీ కుమార్

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	135
రిటైల్	157
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	259
లేయర్ మాంసం	204

వైద్య ఆరోగ్య శాఖలో విజిలెన్స్ విచారణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ తెలిపారు. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్టాఫ్‌నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఆఫీస్ సబార్డినేట్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలను నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెద్దఎత్తున డబ్బులు తీసుకుని భర్తీ చేశారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్‌యాదవ్, మహేష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. భారీ వర్షాల నుంచి ప్రజలను రక్షించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. వాగులు, వంకలు, కాలువలు, కల్వర్టులు, మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో యంత్రాంగం ఎక్కడా రాజీ పడకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎంపీ కోరారు.

రూరల్ డివిజన్ కార్యాలయంలోనే నూతన ఎస్ఈ కార్యాలయం

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరులో విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయాన్ని స్థానిక గిరింపేటలోని విద్యుత్తు శాఖ రూరల్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నామని ఉమ్మడి జిల్లా ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నూతన సర్కిల్ కార్యాలయం తొలి ఎస్ఈగా ఎస్.కె.ఇస్మాయిల్ అహ్మద్‌ను నియమించారని, ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. రూరల్ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వ, ప్రైవేటు భవనాలకు మార్పు చేయనున్నామన్నారు. సర్కిల్ కార్యాలయంతో పాటు నియంత్రికలు, మీటర్లు, విజిలెన్స్, కన్‌స్ట్రక్షన్, సివిల్, అకౌంట్స్ విభాగాలకు అధికారులను నియమించారని, వీరికి కూడా ఇక్కడే గదులు కేటాయిస్తామని చెప్పారు.

సైనిక కార్యాలయం తరలింపునకు ప్రతిపాదన

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ నూతన అధికారిగా నియమితులైన రాఘవులు.. సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ సైనిక సంక్షేమ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తోందని చెప్పారు. పాత కలెక్టరేట్‌లోకి ఈ కార్యాలయాన్ని తరలించేందుకు అనుమతి ఇవ్వాలని విన్నవించారు. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పూలమొక్క అందజేస్తున్న రాఘవులు

భారీ వర్షాలతో తితిదే అప్రమత్తం

తిరుమల, న్యూస్‌టుడే: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. స్థానిక అన్నమయ్య భవనంలో అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2021లో కొండచరియలు విరిగి పడిన ఘటన అనంతరం తితిదే 700 పేజీలతో విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ ప్రణాళికను మరింత మెరుగుపరచాలని అధికారులకు వారు సూచించారు. కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్తుకు అంతరాయం లేకుండా చూడటంతోపాటు ఐటీ విభాగం నుంచి భక్తులకు అందించే సేవలపై అవసరమైతే ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి

బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ఆదాయం రూ.10.08 కోట్లు

ఈ ఏడాది అత్యధికంగా సేవలు

తిరుపతి (ఆర్టీసీ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆర్టీసీ రూ.10.08 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు జరిగిన బ్రహ్మోత్సవాల్లో తిరుమల- తిరుపతి మధ్య మొత్తం 404 బస్సులు వినియోగించారు. 34,528 ట్రిప్పులతో 10.77 లక్షల మంది భక్తులకు సేవలు అందించారు. 2023 మొదటి బ్రహ్మోత్సవాల్లో 31,969 ట్రిప్పులతో 8.56 లక్షల మంది, రెండోసారి జరిగిన బ్రహ్మోత్సవాల్లో 31,836 ట్రిప్పులతో 8.65 లక్షల మందిని తరలించారు. ఐదేళ్లలో జరిగిన బ్రహ్మోత్సవాలతో పోలిస్తే ఈ ఏడాది అత్యధికంగా ట్రిప్పులు, భక్తుల రద్దీతో ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి టి.చెంగల్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ విజయవంతం కావడానికి సహకరించిన తితిదే, పోలీసు శాఖ ఉన్నతాధికారులకు, ఆర్టీసీలోని అన్ని యూనియన్ల నాయకులకు, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.30 లక్షలకు వ్యాపారి ఐపీ దాఖలు

సదుం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని వీఆర్ఆర్ కాలనీకి చెందిన ఓ వ్యాపారి రూ.30 లక్షలకు ఐపీ దాఖలు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బోయకొండ.. ముగ్గురు వ్యక్తుల నుంచి రూ. 30 లక్షలు అప్పుగా తీసుకుని స్థానికంగా సెల్ దుకాణం ప్రారంభించారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో దుకాణం మూసేసి ప్రస్తుతం సప్లయర్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. రుణ దాతలు గంగులమ్మ, గంగమ్మ, బాలాజీల ఒత్తిడి పెరిగిందని.. చెల్లించే పరిస్థితి లేదని.. పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఇన్‌సాల్వేన్సీ పిటిషన్ దాఖలు చేసినట్లు న్యాయవాది షాకత్‌అలీ తెలిపారు.

ఆవులపల్లె జలాశయం వద్ద ఉద్రిక్తత

సోమల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆవులపల్లె జలాశయ నిర్మాణం వద్ద సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకొంది. ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తున్న పీఎల్ఆర్ సంస్థ ప్రతినిధి ఆ స్థలంలో నిల్వ చేసిన ఇనుప కమ్మీలు తరలించేందుకు యత్నించారు. అందుకు తగ్గట్లుగా హైకోర్టు ఉత్తర్వులు ఉన్నట్లు చూపారు. జలాశయ నిర్వాసిత రైతులకు ఈ విషయం తెలిసి అతడిని అడ్డుకొన్నారు. సీతమ్మచెరువును పునరుద్ధరించాలని డిమాండు చేశారు. ఈ విషయం తెలుసుకొన్న సీఐ రాంభూపాల్, ఎస్సై శివశంకర్ ఘటనా స్థలానికి చేరుకొన్నారు. రైతులు, కంపెనీ ప్రతినిధితో చర్చలు జరిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం. . కంపెనీ ప్రతినిధి ఇనుప కమ్మీని తరలించే వాహనాలను ఎవరు అడ్డుకోరాదని రైతులకు సూచించారు. తరలింపును అడ్డుకొన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని సీఐ తెలిపారు. దీంతో వివాదం సర్దుకుంది.



రైతులు, పీఎల్ఆర్ ప్రతినిధితో మాట్లాడుతున్న సీఐ రాంభూపాల్

కల్వర్టును కారు ఢీకొని యువకుడి మృతి

ముగ్గురికి గాయాలు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి కడపల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని కోనేరుకుప్పం వద్ద క్వారీలో పని చేస్తున్న నలుగురు కార్మికులు కారులో కుప్పం వెళుతుండగా.. అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ప్రమాదంలో రాళ్లబూదుగూరుకు చెందిన జమీర్ అహ్మద్ (23)కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున చనిపోయారు. రాళ్లబూదుగూరుకు చెందిన అబూసిద్ధిక్, తమిళనాడు పరిధి గుడియాత్తంకు చెందిన లోకేష్‌నటరాజన్, వర్దనపల్లెకు చెందిన తరుణ్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై నరేష్ ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: డీఎస్సీకి ఎంపికైన గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి మూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన గిరిజన నిరుద్యోగ యువతీయువకులు వెబ్‌సైట్ https://jnanabhumi.ap.gov.in లో ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 27న స్క్రీనింగ్ పరీక్ష, 28న మెరిట్ జాబితా ప్రకటించనున్నామన్నారు. వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: కొంగారెడ్డిపల్లి ఆఫీసర్స్‌లేన్‌లోని మురుగునీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **-స్థానికులు**

సమాధానం: డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులు చేపడతాం. **-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

న్యూస్‌టుడే, పెనుమూరు

సమస్య: పులికల్లు పంచాయతీ గొడుగుమానుపల్లె బీసీ కాలనీ వద్ద ఉన్న మురుగు కాలువ అధ్వానంగా ఉంది. **- స్థానికులు**

సమాధానం: గ్రామంలోని మురుగు కాలువ పరిశీలించి పూడిక తొలగింపజేస్తాం. **-శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

న్యూస్‌టుడే, పాలసముద్రం

సమస్య: చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారి వీర్ల గుడి గ్రామ సమీపంలో ఏర్పడిన ప్రమాదకర గుంత పూడ్చి, ప్రమాదాల హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి **-బాబు, గ్రామస్థుడు**

సమాధానం: ఈ గుంతను తాత్కాలికంగా మట్టి తోలి పూడ్చి ప్రమాదాన్ని నివారిస్తాం. ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం అందించి శాశ్వత పరిష్కారం చూపుతాం. **-విద్యావతి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పాలసముద్రం**

న్యూస్‌టుడే, నగరి

సమస్య: కొండచుట్టు మండపం ఎదురుగా ఉన్న కృష్ణానగర్ రోడ్డు వర్షానికి కొట్టుకుపోయి వాహనాలు జాతీయ రహదారి వైపు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. **-కుమార్, నగరి**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-నవీన్, ఏఈ, నగరి**

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

సమస్య: మకరపట్టు శివాలయ సమీపంలో రక్షిత మంచినీటి సరఫరా పైప్‌లైన్ పాడైపోయి ప్రతిరోజూ నీరు వృథాగా పోతోంది. నీరు కలుషితం సహా ఆ మార్గం బురదమయం అవుతోంది. **-సువర్ణమ్మ, స్థానికురాలు**

సమాధానం: పంచాయతీ సిబ్బందిచే దెబ్బతిన్న పైప్‌లైన్ బాగుచేయించి నీటి వృథా అరికడతాం. **-ఉదయ్, పంచాయతీ కార్యదర్శి, జీడీనెల్లూరు.**

అందుబాటులో వైద్యాధికారులు.. గుడిపాల: అధిక వర్ష సూచన నేపథ్యంలో గుడిపాల పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది 24 గంటలు ప్రజలు అందుబాటులో ఉంటారని వైద్యాధికారి సంధ్య తెలిపారు. ప్రథమ చికిత్సకు కావాల్సిన మందులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే స్థానిక ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు తెలియజేయాలని ఆమె కోరారు.

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

పురపాలక సంఘ పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో చెత్త తొలగించరూ శీర్షికన స్థానికుల సమాచారంతో వార్త ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, పుత్తూరు



గంగినేని చెరువు సప్లై ఛానల్ పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

మురుగు కాలువల్లో పూడికతీత

నగరపాలక సంస్థలో కంట్రోల్‌రూమ్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో నగరంలోని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. స్థానిక గంగినేని చెరువు సప్లై ఛానల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. సీఎంటీ రోడ్డు, ఎన్టీఆర్ నగరపాలక బస్టాండు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్ని తనిఖీ చేశారు. మరో రెండ్రోజులు వర్షాలు కురుస్తాయన్న ప్రకటనల నేపథ్యంలో అధికారులు అప్రమతంగా ఉండాలన్నారు. నగరపాలక ఆరోగ్యాధికారి అనిల్ కుమార్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ❖ వర్షాల నేపథ్యంలో నగరపాలక పరిధిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. **98499 07885** నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. దీని కోసం ప్రత్యేక బృందాలను నియమించామని ఆయన పేర్కొన్నారు.

నీవా.. సురక్షితమేనా..?

● పరివాహక ప్రాంతాలకు వరద ముప్పు
● రక్షణ చర్యలపై దృష్టి సారించని యంత్రాంగం



వీరభద్రకాలనీలో ఇళ్లను చుట్టుముట్టిన వరద (పాత చిత్రం)

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

● నగరంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం ఆరు గంటల వరకు 10.2 మి.మీ వర్షం కురిసింది. ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 107.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతమే అయినా.. 15, 16 తేదీల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ముందస్తు ప్రకటన నేపథ్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షితమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రకటనలకే పరిమితమైన అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించలేదు.

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా రానున్న రెండ్రోజుల్లో భారీ వర్షాలు పడనున్నాయన్న ప్రకటనల నేపథ్యంలో చిత్తూరు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో అధికార యంత్రాగం ఇప్పటివరకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు.. భారీ వర్షాల కారణంగా నీవా నది పరివాహక ప్రాంతాలకు వరద ఏటా ముప్పు తప్పడం లేదు.. నీవా నది నుంచి పరివాహక ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించడానికి ఏటా చేపట్టే చర్యలు తాత్కాలికంగానే ఉంటున్నాయి. నదికి రెండు వైపులా రక్షణ ప్రహరీ నిర్మించాలన్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు.

గతంలో ఇలా..

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నగరంలోని లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉంది. ప్రధానంగా నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న నీవా నది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు పడితే ముంపునకు గురవుతోంది. 2021లో కురిసిన వర్షాలకు చిత్తూరు నగరం చిగురుటాకులా వణికిపోయింది. నీవా నదిలో ప్రవాహం ధాటికి పరివాహక ప్రాంతాల ప్రజలు అక్కడి నుంచి తరలి వెళ్లాల్సి వచ్చింది. అధిక వర్షాల కారణంగా నగరం నడిబొడ్డున ఉండే నీవానదిలో వరద పోటెత్తింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నది ప్రవహించింది. నది పరివాహక ప్రాంతాలైన వీరభద్ర కాలనీ, తేనెబండ, తోటపాళ్యం దోబీఘాట్, కైలాసపురం ప్రాంతాల్లో ప్రజల్ని నగరపాలక, రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రాంతాల్లో నదిని అనుకుని ఉన్న తాత్కాలిక ఇళ్లు కూలిపోయాయి. స్థానిక జైహింద్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బాధితులకు ఆశ్రయం కల్పించి భోజన వసతి కల్పించారు. సంతపేట ప్రారంభంలోని లిల్లీ వంతెనను నేల మట్టం నుంచి తాకుతూ నీవా నదిలో వరద నీరు ప్రవహించడంతో.. వంతెనపై రాకపోకల్ని మూసివేశారు. ప్రజలు ఎవరూ వంతెన వైపు రాకుండా పోలీసులు కాపలా కాశారు. ఏటివార రాజుగుడి ఎదురుగా నీవా నదిపై ఉన్న తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి ఆలయానికి రాకపోకలు స్తంభించాయి. నీవా నది నగరంలోకి ప్రవేశించే ఇరువారం పోతంబట్టు నుంచి దొడ్డిపల్లె వరకు పరివాహక ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. 30 ఏళ్ల తరవాత నదిలో ప్రవాహ ఉద్ధృతి 2021లో పెరిగింది. గత అనుభవాల దృష్ట్యా వర్షాలకు ముంపు ప్రాంతాల ప్రజలను రక్షణ కల్పించే అంశంపై అధికార యంత్రాంగం తాజాగా పెద్దగా దృష్టి సారించలేదు.



నీవానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నగర పాలక అధికారులు

చర్యలు తీసుకుంటాం..

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నీవానది పరివాహక ప్రాంతాలు పరిశీలించాం. నది ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

బెంగళూరు తెదేపా ఓటర్ల కృషి మరువలేనిది

పాలసముద్రం, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని మరో కుప్పం తరహాలో తీర్చిదిద్దేందుకు తెదేపాని గెలిపించేందుకు బెంగళూరు బిల్డర్స్, ఓటర్ల కృషి ఎన్నడూ మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పేర్కొన్నారు. ఆముదాల పంచాయతీ రంగాపురంక్రాస్‌లో బెంగళూరు ప్రవాసాంధ్రులు బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు, మండల వాసులు ఆయన్ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి బెంగళూరు నుంచి వచ్చిన ప్రవాసాంధ్రులు ఎన్నో కష్టాల కోర్చి ఓట్లేసి గెలిపించారన్నారు. వారికి తానెప్పుడూ రుణపడి ఉంటానని, అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. త్వరలో ప్రతి పంచాయతీలో సమస్యలు గుర్తించి 2029 నాటికి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రకృతి షెల్టర్ తాళ్లూరు శివ, నీరజాక్షులునాయుడు, మణినాయుడు, భక్తవత్సలం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెంగళూరు బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు



చెరువు కాదు.. రోడ్డే..!

ప్రధాన రోడ్లంటేనే చూడముచ్చటగా ఇరువైపులా పచ్చటి మొక్కలతో విశాలంగా కనిపించేవి. చిత్తూరు- బలిజకండ్రిగ ప్రధాన రహదారి మాత్రం చెరువును తలపిస్తోంది. పై చిత్రంలో కనిపించేది చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారి అయ్యప్పరాజు కండ్రిగ వద్ద దుస్థితి. ఇటీవలి వర్షానికి ప్రధాన రోడ్డు అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. బస్సులు పక్కకు దిగిపోతున్నాయి. బైకులు నీటిలో దిగి జారిపోతున్నాయి. ఎక్కడ దిగాలో.. ఎక్కాలో తెలియక వాహనాలు రోడ్డుపై నిలిచిపోతున్నాయి. ప్రజలు నానా అవస్థలు పడుతన్నారు.

-న్యూస్‌టుడే, పాలసముద్రం



ఇదో తికమక క్రాస్..!

చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారినిలో దీనబంధుపురం క్రాస్ కూడలిలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏ రోడ్డు.. ఎటు పోతుందోనని, గ్రామాలకు వెళ్లే రహదారి పేర్లు క్షుణ్ణంగా రాసి కూడలిలో ఏర్పాటు చేశారు. దానిపై వివిధ ప్రచార పత్రికలు అతికించడంతో బలిజకండ్రిగకు వెళ్లే ప్రయాణికులు అటు తమిళనాడుకు వెళ్లిపోతున్నారు. తమిళనాడుకు వెళ్లే వారు ఇటు దారి మారి వెళ్లి ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ రహదారి వివరాలు ఎవరిని అడగాలో తెలియక తికమకపడుతున్నారు. సూచిక బోర్డులపై ఇలా ఊర్ల పేర్లు కనిపించకపోవడంతో కొత్తగా వచ్చే ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

విద్యార్థులకు ఎలాంటి హాని జరగకూడదు

ఈనాడు కథనానికి స్పందన

పాలసముద్రం, న్యూస్‌టుడే: శ్లాబ్ కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న పాత పాఠశాల భవనంతో విద్యార్థులకు ఎలాంటి హాని జరగకుండా పూర్తి బాధ్యతలు తీసుకుంటామని ఎస్ఎస్ఏ ఈఈ మధుసుదన్‌రావు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'శిథిలావస్థకు చేరిన భవనంతో విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లల ప్రాణాలకు ముప్పు'పై ఈ నెల 9న 'పసిప్రాణాలతో చెలగాటమా..!', 12న 'శ్లాబ్ కూలింది..' ముందే హెచ్చరించిన ఈనాడు' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్తలు ప్రచురితమయ్యాయి. సోమవారం ఎస్ఎస్ఏ ఈఈ మధుసుదన్‌రావు ఎంఈవో రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులతో భవనాన్ని పరిశీలించారు. భవన పరిస్థితి దారుణంగా ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనాన్ని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



శ్లాబ్ కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఈఈ మధుసుధన్‌రావు, ఎంఈవో రాజేంద్రప్రసాద్

అథ్లెటిక్ పోటీల్లో నగరి విద్యార్థి ప్రతిభ

నగరి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్-20 అథ్లెటిక్ పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పి. జగదీష్ ద్వితీయ స్థానం సాధించారని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించారన్నారు. విద్యార్థిని ఈ మేరకు జగదీష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ భాస్కరరాజు, పి.డి. రెడ్డినాయక్, ప్రేమకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



జగదీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

బాధ్యతల స్వీకరణ.. తవణంపల్లె: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలానికి బదిలీ అయ్యారు. కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రెడ్డిబాబు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. **జీడీనెల్లూరు:** ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా హరిప్రసాద్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. యాదమరి మండల ఈవోపీఆర్డీగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు ఈవోపీఆర్డీగా వచ్చి, ఖాళీగా ఉన్న ఎంపీడీవో స్థానంలో ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆయనకు తెదేపా నేతలు స్వామిదాస్, వెంకటేష్, ప్రభాకర్‌నాయుడు, జాన్ స్వాగతం పలికారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

ప్రారంభమైన పల్లె పండుగ

పుత్తూరు: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఎగువ తిరుమలకుప్పం దళితవాడలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో రూ.10 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పుత్తూరు మండలంలోని 14 పంచాయతీలకు రూ.2కోట్లు మంజూరు చేశారన్నారు. ఎంపీడీవో రమేష్‌బాబు, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, ఏపీవో భార్గవి, తెదేపా నాయకులు ఈశ్వర్, బాలాజీ పాల్గొన్నారు. **నగరి:** గుడికండ్రిగలో రూ.6.25లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భానుప్రకాష్ భూమిపూజ చేశారు. తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఆర్.మీర, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్‌రెడ్డి, పురుషోత్తం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ, చినబాబు, అధికారులు పాల్గొన్నారు. **కార్వేటినగరం:** నియోజకవర్గంలో రూ.12.68 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే థామస్ తెలిపారు. అల్లాగుంట, శెట్టిగుంట, పద్మ సరస్సు ఎస్టీ కాలనీలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. తన సొంత గ్రామమైన అల్లాగుంటకు 50 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేదని, తాజాగా రూ.20 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. మండలంలో రూ.3.67 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దారు భగవతి, జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు యుగంధర్, తెదేపా మండల అధ్యక్షుడు చెంగ్రాయులు యాదవ్, తెదేపా నాయకులు యోనా, రాజా పాల్గొన్నారు.



నగరి: గుడికండ్రిగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



కార్వేటినగరం: అల్లాగుంటలో సీసీరోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే థామస్

ముందస్తు సహాయక చర్యలకు సిద్ధంకండి

నగరి, న్యూస్‌టుడే: వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రకటించిందని, ముందస్తు సహాయక చర్యలకు అధికారులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద వచ్చే ప్రాంతాలను ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సహాయక శిబిరాలు సిద్ధం చేయాలని సూచించారు. అధిక వర్షాలు పడితే నిరాశ్రయులకు ఆహారం ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైన నిధులు అందించాలని కలెక్టర్‌ను కోరతానని, గత అనుభవాల దృష్ట్యా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎవరికీ సెలవులు ఇవ్వకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, సీఐ మహేశ్వర్, విద్యుత్తుశాఖ ఏడీఈ వెంకటముని, హౌసింగ్ డీఈఈ శంకరప్ప, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు. **తవణంపల్లె, న్యూస్‌టుడే:** తుపాను సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుధాకర్ కోరారు. తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు



ఎస్ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని, నాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు అగస్టియన్ శ్యామూల్ మాట్లాడుతూ పద్నాలుగేళ్ల తరవాత తమను గుర్తుపెట్టుకుని పిలిచి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పరుచుకోనున్న పల్లె దారులు

● అధ్వానంగా ఉన్నవాటికి ప్రాధాన్యం
● త్వరలో పనుల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు

న్యూస్‌టుడే, చిత్తూరు (జిల్లా పంచాయతీ, యాదమరి)

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లె రహదారులు అడుగుకో గుంత అన్నట్లు అధ్వానంగా మారాయి.. గత ఐదేళ్లలో గుంతలు తట్ట మట్టికీ నోచుకోలేదు.. ఫలితంగా ప్రజలు పడిన బాధలు చెప్పనలవికావు.. ఆయా గుంతల్లో పడి చాలామంది ప్రాణాలు కోల్పోగా.. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు.. తాజాగా అధికారం చేపట్టిన తెదేపా కూటమి ప్రభుత్వం పల్లె దారులకు మరమ్మతులు చేసేందుకు దృష్టి సారించింది.. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది.. అధ్వానంగా ఉన్న రహదారులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనుంది.

రూ.120 కోట్ల బకాయిలు..

గత ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలు, బ్యాంకు రుణాల కింద చేపట్టిన రహదారుల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కంకర పరిచిన అనంతరం పనులు ఆపేయడంతో రాకపోకలకు నిత్యం ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాంటి దారులను పూర్తిచేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాల పరిధిలో 275 రహదారుల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రూ.120 కోట్ల మేర బిల్లులు బకాయిలు ఉన్నాయి. కొందరు గుత్తేదారులు తమకు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారులను బాగు చేసేందుకు జిల్లా స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేయించింది. త్వరలోనే సమస్యకు పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పీఎంజీఎస్‌వై, ఏపీఆర్ఆర్‌పీ, నాబార్డు రుణం, ఎన్‌డీఎంఎఫ్, పంచాయతీరాజ్, రహదారులు భవనాలశాఖ కింద పనులు చేపట్టడానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు రూపొందించారు. త్వరలోనే క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

ఆర్‌అండ్‌బీలోనూ..

రహదారుల్లో కీలకమైన ఆర్‌అండ్‌బీ విభాగంలోనూ ఇదే తరహాలో కసరత్తు జరుగుతోంది. ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలో వందల కిలోమీటర్ల మేర రాష్ట్ర, జిల్లా రహదారులు ఉన్నాయి. భారీ వర్షాలకు, వాహనాల తాకిడికి 80 శాతం రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రజలు ప్రయాణించడానికి వీల్లేనంతగా ఛిద్రమయ్యాయి. వైకాపా అధికారంలో ఉన్నన్నాళ్లు వీటి నిర్వహణను కనీసం పట్టించుకోలేదు. ప్రమాదాలకు గురై పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రహదారులపై ప్రతిపాదనలను ప్రభుత్వం తెప్పించుకుంది. కొన్నింటికి ఇప్పటికే పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. ఆమోదించిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. గత కొద్ది రోజులుగా బదిలీల వ్యవహారంలో ఉన్న రహదారులు, భవనాలశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాలు ఇప్పుడే కుదుటపడ్డాయి. రహదారుల మరమ్మతులు చేపట్టడానికి చర్యలు వేగిరం చేశాయి. ఇలా ఆయా శాఖల సమన్వయంతో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.



చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి నుంచి భూమిరెడ్డిపల్లికి వెళ్లే దారి దుస్థితి

ఓంశక్తి ఆలయంలో అన్నదానం.. నగరి: నవరాత్రి ముగింపు ఉత్సవం సందర్భంగా ఓంశక్తి ఆలయంలో సోమవారం అన్నదానం, వస్త్రదానం చేశారు. ఉత్సవాలకు సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు, దాతలు పాల్గొన్నారు.

16న పల్లె పండుగ.. బంగారుపాళ్యం: ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లెపండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ సోమవారం తెలిపారు. 16న ఎమ్మెల్యే మురళీమోహన్ తుంబకుప్పం, సదకుప్పం, నల్లగాంపల్లె, తంబుగానిపల్లె గ్రామాల్లో సీసీరోడ్లు, తారురోడ్డు పనులు ప్రారంభిస్తారని, మండలంలో రూ.కోటితో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా అష్టబంధన మహాకుంభాభిషేకం

పుత్తూరు, న్యూస్‌టుడే: ముద్దుకృష్ణాపురంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలో కలశాభిషేకం నిర్వహించిన అనంతరం విఘ్నేశ్వరపూజ, గణపతిహోమం, నవగ్రహ హోమం, నవగ్రహ శాంతి, నక్షత్ర శాంతి సుదర్శన హోమం కార్యక్రమాలు నిర్వహించారు. మహాకుంభాభిషేకం నిర్వహించిన అనంతరం కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలు గ్రామస్థుల ఆధ్వర్యంలో జరిగాయి.



మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ జలాశయం పరిశీలన

పెనుమూరు: ఎన్టీఆర్ జలాశయాన్ని జలవనరులశాఖ డీఈఈ జయచంద్రబాబు సోమవారం పరిశీలించారు. జలాశయం లోతట్టు ప్రాంతంలో నీటి నిల్వ విషయాన్ని తెలుసుకున్నారు. గేట్ల నిర్వహణకు అమర్చిన మోటార్లు, గేట్ల పనితీరు పరిశీలించారు. భారీ వర్షాలు కురిసి వరద జలాశయంలోకి చేరితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. **పెనుమూరు:** వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ అన్నారు. తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మోటార్లు పరిశీలిస్తున్న డీఈఈ జయచంద్రబాబు


మహిళలతో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం వినతులను ఆయా శాఖాధికారులకు అందించి, వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

మండల సమావేశం వాయిదా

కల్లూరు: తుపాను ప్రభావంతో మంగళవారం నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత మరో తేదీని ప్రకటిస్తామని సభ్యులు గమనించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

సదుం, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని స్థానిక అంకెవారివీధి రహదారి రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. నడిచేందుకు సైతం ఇబ్బందిగా మారింది. అధికారులు మరమ్మతులు చేయాలి. **- స్థానికులు**

సమాధానం: వెంటనే పరిశీలించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **-వరప్రసాద్, ఈవోపీఆర్డీ**

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే :

సమస్య: మండలంలోని పాలెంపల్లె పంచాయతీ కేంద్రంలో మురుగు కాలువలు శుభ్రం చేసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- లీలామాధవి, ఎంపీడీవో, పుంగనూరు**

శాంతిపురం, న్యూస్‌టుడే:

సమస్య: మండల కేంద్రంలోని బస్టాండు కూడలి, కేజీఎఫ్ రహదారిపై పలుచోట్ల వర్షపునీటి మడుగులతో పాదాచారులు, వాహనదారులకు అసౌకర్యంగా మారింది. **- కిశోర్, స్థానికుడు**

సమాధానం: రోడ్లపై నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు చేపడుతాం. **- అశ్వర్థనారాయణ, పంచాయతీ కార్యదర్శి**


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం

వాల్మీకి జయంతి పండుగలా జరుపుకొందాం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని ప్రభుత్వ పండుగగా జరుపుకునేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వ పండుగల్లో చేర్చిందన్నారు. ఈ దఫా గురువారం వాల్మీకి జయంతిని అత్యంత ఘనంగా జరుపుకొందామని పిలుపునిచ్చారు. 2019 తెదేపా ప్రభుత్వంలో రూ.2 కోట్లతో వాల్మీకి భవనాన్ని ప్రారంభించామన్నారు. నాయకులు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, కౌన్సిలర్లు దాము, సురేష్ పాల్గొన్నారు.

● బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పురపాలక పరిధిలోని 8వ వార్డు బాబునగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను వారు పరిశీలించారు. పురపాలక కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే దుకాణాల ఏర్పాటు

పుంగనూరు, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానంలో నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఉన్న 19 మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీ పడ్డారు. వీటి కోసం 200 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా రూ. 4 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం చిత్తూరులో దుకాణాల కేటాయింపు ముగిసిందని నిబంధనల ప్రకారమే దుకాణాలు ఏర్పాటు చేయిస్తామని ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. నిర్వహణలో ప్రభుత్వం ఇచ్చే నిబంధనలను ఖచ్చింతగా అమలు చేస్తామన్నారు. కర్ణాటక మద్యం, నాటు సారా అరికట్టడంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని వివరించారు.


అయ్యావాండ్లపల్లె: పెద్దబెస్తపల్లెలో సీసీరోడ్డు భూమిపూజలో స్థానికులు

పల్లె పండుగ..
● పనులకు జోరుగా శంకుస్థాపనలు
● వైకాపా పాపాన్ని కడిగేసేలా నిర్ణయం

కూటమి అండగా

పుంగనూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. వసతుల కల్పన మాట అటుంచితే.. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను మళ్లించింది. ఫలితంగా గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేని దుస్థితి. ఖాతాల్లోని నిధులు మళ్లించడంతో ప్రజలకు సమాధానం చెప్పలేక పల్లె పాలకులు తలలు పట్టుకున్నారు. మరి కొందరు వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. అయినా అప్పటి పాలకల్లో స్పందన కనిపించలేదు. అప్పటి ప్రాధాన్య పథకాలకే ఉపాధి నిధులను మళ్లించారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు.

కొత్తరూపుతో..

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్రామాలు కొత్తరూపును సంతరించుకోనున్నాయి. 2014-19 మధ్య కాలంలో నాటి తెదేపా ప్రభుత్వం ఉపాధి హామీ మెటీరియల్ ఫండ్‌ను మురుగు కాలువలు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు వెచ్చించారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌లకు వెచ్చించినా అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్ని అసంపూర్తిగా నిలిచాయి. దీంతో మిగిలిన పనులు పడేశాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆగస్టు 23న గ్రామసభలు నిర్వహించి పనులకు ఆమోదం తీసుకున్నారు. ఈ నెల14న పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభించారు. వాటికి 21 వరకు భూమిపూజ చేయనున్నారు.

గ్రామాలకు మహర్దశ



కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్రామాలకు మహర్దశ పట్టనుంది. ఏళ్ల తరబడి నిర్వహణ లేక అధ్వానంగా మారిన రోడ్లు, కాలువల రూపురేఖలు మారనున్నాయి. పారిశుద్ధ్యం మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటాం. పాడి రైతులకు గోకులం షెడ్లు దోహదపడతాయి.

- చల్లా రామచంద్రారెడ్డి, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి

మండలాల వారీగా గణాంకాలు

మండలం	సీసీరోడ్లు	రూ.లక్షల్లో	కాల్వలు	రూ.లక్షల్లో	పశువుల షెడ్లు	రూ.కోట్లలో
పుంగనూరు	18	81.00	14	83.00	50	1.15
చౌడేపల్లె	14	89.50	7	74.00	50	1.15
సోమల	34	129.00	8	30.50	50	1.15
సదుం	34	145.00	2	15.00	50	1.15
పులిచర్ల	38	167.40	22	148.50	50	1.15
రొంపిచర్ల	20	129.90	9	67.00	50	1.15

రూ.17.80 కోట్లతో రోడ్లు, కాల్వలు, షెడ్లు

పుంగనూరు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో గ్రామసభల నిర్వహించి 518 పనులకు ఆమోదం తీసుకున్నారు. ఆ పనులకు రూ.17.80 కోట్లు కేటాయించారు. ఇందులో అధికంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు, గోకులాల షెడ్లు ఉన్నాయి.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణం ప్రధాన రహదారిలో గుంత ఏర్పడటంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానికుల ఫిర్యాదుతో 'మేమున్నాం.. మీకుతోడుగా'తో వార్త ప్రచురితమైంది. ఆర్అండ్‌బీ డీఈఈ దస్తగిరి స్పందించి గుంతను తాత్కాలికంగా మట్టితో పూడ్చారు. త్వరలో పూర్తిస్థాయి మరమ్మతులు చేయించనున్నట్లు చెప్పారు.

స్పందనకు వందనం

గుంతల పూడ్చివేత

పుంగనూరు : పురపాలక పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ మార్గంలో పెట్రోల్ బంకు, ఆంజనేయ గుడి సమీపంలో నడిరోడ్డులో ఏర్పడ్డ గోతులను పురపాలక అధికారులు సోమవారం పూడ్చారు. ఈనెల 4న 'మేమున్నాం మీకుతోడుగా'లో సమస్య ప్రచురితమైంది. దీంతో కమిషనరు మధుసూదనరెడ్డి స్పందించి గోతులు పూడ్చివేయించారు.


మౌలానాకు పత్రం అందిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

ఖాజీగా నియామకం

పుంగనూరు: పుంగనూరు మండల ఖాజీగా మౌలానా మహ్మద్ ఎజాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత నియామక పత్రాలను సోమవారం పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మౌలాన్‌కు అందజేశారు. ఖాజీగా నియమితులైన ఆయన మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అవకాశం కల్పించిన చల్లా బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సుహేల్‌బాషా, సద్దాం హుసేన్, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

20న వ్యవస్థాపక వేడుకలు

కుప్పం గ్రామీణ: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఈనెల 20న వర్సిటీ 27వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జరుగుతుందని రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ సోమవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.

వివాదాస్పదమైన సంఘమిత్ర మార్పు


సమావేశాన్ని బహిష్కరించిన స్వయం సహాయక సంఘాల సభ్యులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ వీవో-2 సంఘమిత్రను మార్చడం వివాదంగా మారింది. సోమవారం జరిగిన గ్రామ సమాఖ్యలో సభ్యులు సమావేశం బయటకు వెళ్లిపోయారు. ఏపీఎం సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘమిత్రగా విధులు నిర్వహిస్తున్న సుహాసినిని తొలగించి ఈ స్థానంలో అదే గ్రామానికి చెందిన వసంతను నియమించాలని తీర్మానించారు. దీంతో సభ్యులు పాత సంఘమిత్రనే ఉండాలని సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు సుహాసినిపై.. గంగాభవాని స్వయం సహాయక సంఘ సభ్యురాలు వసంత ఆరోపించారు. దీన్ని మిగిలిన సభ్యులు వ్యతిరేకించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీసుకుంటామని అధికారులు తెలిసి సమావేశాన్ని వాయిదా వేశారు.

ఎట్టకేలకు నియంత్రిక ఏర్పాటు



బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కార్వేటిరామనగర్‌లో పంచాయతీ బోరుకు విద్యుత్ నియంత్రిక లేకపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామస్థులు సెప్టెంబరు 18న మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన చేపట్టారు. తాత్కాలికంగా నీటి సమస్య పరిష్కారానికి 25 రోజులుగా ట్యాంకర్లతో సరఫరా చేపట్టారు. తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ నియంత్రిక ఏర్పాటునకు అధికారులు చర్యలు చేపట్టారు.

నిర్వహణ విస్మరించి.. ఇబ్బందులకు గురిచేసి

ఈ చిత్రంలో కన్పిస్తున్న రోడ్డు కెళవాతి-కొళత్తూరు మార్గం. కెళవాతి గ్రామ సమీపంలోని దిగువచెరువు కట్టపై ఉంది. రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఫలితంగా రోడ్డుపై ఆటో వెళితే కనీసం మనిషి నడిచివెళ్లేందుకు సైతం వీలుకావడం లేదు. కట్టపై ఎదురెదురుగా వాహనాలు వస్తే వెనక్కి వెళ్లిపోవాల్సిందే తప్పా తొలగేందుకు ఏమాత్రం వీలుకాని దుస్థితి. అధికారులు వాటి తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- న్యూస్‌టుడే, పెద్దపంజాణి





కంకర రోడ్డు.. అడుగడుగునా గుంతలు

లక్కనపల్లె నుంచి శెట్టిపల్లెకు వెళ్లే రోడ్డు గుంతలమయమై దుస్థితికి చేరింది. కంకర తేలిపోయి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. తారు రోడ్డు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వైకాపా ప్రభుత్వంలో నిర్మాణానికి నోచుకోలేదు. ఐదేళ్లుగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కంకర తేలిన రోడ్డుపై నిత్యం పాఠశాల విద్యార్థులు, ద్విచక్ర వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు వస్తున్నాయి. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ వివరణ కోరగా సమస్యను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

అనుమతులంటూ ఆలస్యం.. వినియోగదారులకు శాపం

రూ.86 కోట్లతో నిర్మాణం.. ప్రారంభానికి నోచని వైనం

వి.కోట, న్యూస్‌టుడే: కోట్ల వ్యయంతో నిర్మించిన ఉప కేంద్రం అందుబాటులోకి రాక రైతులు, గృహ, చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నుంచి అనుమతి రావాలంటూ నెలల తరబడి జాప్యం చేస్తుండటంతో ఆయా వర్గాలు భారీ మూల్యం చెల్లిస్తున్నారు. లో ఓల్టేజీతో నియంత్రికలు విఫలమవుతున్నాయి. గృహోపకరణాలు పాడవుతున్నాయి. పరిశ్రమల్లో విలువైన యంత్రాలు సైతం విఫలమవుతున్నాయి.

దశాబ్దాల కల

శాంతిపురం 132/33 కేవీ ఉప కేంద్రం నుంచి రామకుప్పం, శాంతిపురం, వి.కోట, బైరెడ్డిపల్లె మండలాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఆ కేంద్రంపై అధిక లోడ్ కారణంగా శివారు మండలాలు, గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. వి.కోట, బైరెడ్డిపల్లె మండలాలకు ప్రత్యేకంగా 132/33కేవీ సబ్‌స్టేషన్ దశాబ్దాలుగా నోచుకోలేదు. ఎట్టకేలకు 2019లో తెదేపా ప్రభుత్వం వి.కోట మండలం తోటకనుమ సమీపంలో కేంద్రం మంజూరు చేసింది గత ప్రభుత్వం రూ.86 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించింది. అయితే పనులు అనుకొన్న సమయానికి పూర్తిచేసినా ప్రారంభించడంలో అలసత్వాన్ని చూపారు.


ప్రారంభానికి నోచుకోని 132/33 కేవీ ఉపకేంద్రం

లో ఓల్టేజీ సమస్య

వి.కోట, బైరెడ్డిపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలోని రెస్కో, ట్రాన్స్‌కో నిర్వహిస్తున్న నియంత్రికలు లో ఓల్టేజీ కారణంగా మరమ్మతులకు గురౌవుతున్నాయి. వాటికి మరమ్మతులు చేసి తిరిగి అమర్చే లోపు పంటలకు నీరందక ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు.

త్వరలో ప్రారంభం

పనులు పూర్తి చేశాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాం. అనుమతులు రాగానే ప్రారంభిస్తాం.

- చిన్నబ్బ, ఏడీఈ, ట్రాన్స్‌కో

అప్రమత్తంగా ఉండాలి

కుప్పం గ్రామీణ: తుపాను ప్రభావంతో వరిరైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో అమృతవల్లి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట ఒబ్బిడిచేసి వర్షానికి తడవకుండా సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలన్నారు. **బైరెడ్డిపల్లె:** వర్షాలు కురిస్తే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో గీతాకుమారి తెలిపారు. పంట కోత కోయరాదన్నారు. కోత దశలోని వరి పంట నేల వాలితే కంకులు నీటిలో తడిసి మొలకెత్తకుండా దుబ్బులుగా కట్టుకుంటే నష్టాన్ని తగ్గించవచ్చని, సూచనలు పాటించాలని తెలిపారు.

రెండు రోజుల శిక్షణ

పెద్దపంజాణి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పాలనా, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచి హాజరయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు చెప్పారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

పల్లె పండుగ వారోత్సవాల ప్రారంభం

కల్లూరు: గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని రాజంపేట పార్లమెంటు తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయనాయుడు విమర్శించారు. సోమవారం దేవళంపేట పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో పలు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పుంగనూరు: ఎన్టీఆర్ నగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీజె అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు అయూబ్‌ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం పీఈఎస్ వైద్యశాల వైద్యనిపుణులు సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

పాఠశాలలకు సెలవు

కల్లూరు: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 15, 16 తేదీలు సెలవు రోజులుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంఈవో సిద్ధరామయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

విగ్రహం ఏర్పాటుకు చేయూత

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరులో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహం ఏర్పాటు చేసేందుకు చేయూతనిస్తానని మాజీ ముఖ్యమంత్రి, భాజపా నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారని పుంగనూరుకు చెందిన ఏపీజె అబ్దుల్‌కలాం ట్రస్టు వ్యవస్థాపకులు, భాజపా నాయకుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలికిరిలో ఆయనను కలిసి ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించినట్లు పేర్కొన్నారు.


మాజీ సీఎం, భాజపా నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ట్రస్టు ప్రతినిధులు


తొక్కేసిన వరిని చూపుతున్న బాధిత రైతు

ఏనుగుల దాడిలో వరి పైరుకు నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: ఏనుగుల గుంపు దాడిలో రైతులకు భారీ నష్టం జరుగుతుంది. సోమవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు అయ్యావాండ్లపల్లె పంచాయతీలోని వరి పొలాలపై దాడి చేశాయి. రైతు ధనంజయ ఒకటిన్నర, ఎల్లప్ప, చిన్నరెడ్డప్ప ఎకరా, మంగళపల్లెకు చెందిన కుమార్, ఎర్రంవాండ్లపల్లెకు చెందిన నారాయణ, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, గేటుకాడబెస్తపల్లె, దిన్నెబెస్తపల్లె, కొంగరవారిపల్లెకు రైతులకు చెందిన పంటలు నష్టపోయారు. మామిడి తోట రాతి కూసాలు ధ్వంసం చేశాయి.

వృద్ధురాలికి గాయాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు మదనపల్లె మార్గంలోని బైపాస్‌రోడ్డులో మతిస్థిమితం లేని వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న మహిళను బీట్ కానిస్టేబుళ్లు కనుగొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధురాలు మండలంలోని గూడూరుపల్లె గ్రామానికి చెందిన లేట్ నాగప్ప భార్య ఆదెమ్మ (65)గా గుర్తించి కుమార్తె గంగాభవానికి సమాచారం అందించారు. ఆదెమ్మ కుమార్తె ఇంటి వద్ద నుంచి నడుచుకుంటూ సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని భీమగానిపల్లెకు వెళ్లింది. అక్కడ ప్రమాదం జరిగింది. మెరుగైన వైద్యం కోసం రుయాకు తరలించారు.

అగ్నిప్రమాదంలో ఆస్తినష్టం

పలమనేరు: పట్టణంలోని జెండామఠం వీధిలో ఆరిఫ్‌కు చెందిన ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో రూ.లక్ష విలువైన పరికరాలు, వస్తువులు బూడిదయ్యాయి. సోమవారం ఉదయం ఉన్నట్టుండి ఇంట్లో మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబ సభ్యులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. గృహోపకరణాలు దగ్ధం కావడంతో నష్టం జరిగినట్లు సిబ్బంది తెలిపారు.

నాడు దారిచ్చారు.. నేడు లేదన్నారు


కంచె వేసిన ప్రదేశం

పలమనేరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయ భవనానికి ఇప్పుడే దారి లేదంటున్నారు. మండలంలోని జగమర్ల గ్రామ సచివాలయ భవనాన్ని వైకాపా ప్రభుత్వంలో నిర్మించారు. అప్పట్లో భవనానికి అవసరమైన దారి కూడా ఉండేది. అయితే ఇటీవల కొందరు ఆ దారి తమ సొంత స్థలంలో ఉందని అడ్డుకుని కంచె వేశారు. దారి కోసం స్థలాన్ని అప్పట్లో ఇచ్చామని ఇప్పుడు తాము ఇవ్వలేమని చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది ఈ సమస్యపై ఎటూ తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు. గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి సచివాలయ భవనం కోసం స్థలాన్ని కేటాయించారు. భవనానికి ఎదురుగా ఉన్న వ్యవసాయ పొలంలోంచి దారి ఉండేది. భవనానికి వెనుకవైపు దారి ఉందని దాన్ని ఉపయోగించుకోవాలని ముందు వైపు దారికి కంచె వేశారు. రెండు రోజులుగా ఈ సమస్య ఉత్పన్నమైంది. ఇదిలా ఉంటే గ్రామానికి చెందిన మరో వర్గం సోమవారం పీహెచ్‌సీకి తాళాలు వేశారు. తమకు సచివాలయానికి దారి వదలితేనే తెరుస్తామన్నారు. దీంతో ఉద్యోగులు కొంతసేపు బయటే ఉన్నారు.

ఎంపీడీవో జోక్యంతో

వివాదం తెలుసుకున్న ఎంపీడీవో ఖాదర్‌బాషా సోమవారం గ్రామానికి చేరుకున్నారు. స్థల యజమానితో మాట్లాడి తాత్కాలికంగా కంచె తొలగించారు. అలాగే పీహెచ్‌సీ తాళం తీయించారు. రెండు రోజుల్లో పూర్తిగా సర్వే నిర్వహించి దారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.


ఆరోగ్య కేంద్రం ఎదుట ఉద్యోగుల పడిగాపులు

పశువైద్య ఉపకేంద్రం.. శిథిలం

మండలంలోని భీమగానిపల్లెలోని పశువైద్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. భవనం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. పాడిరైతులు, సిబ్బంది లోపలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. వైద్యులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. భవనానికి విద్యుత్తు, నీటి సౌకర్యం లేదు. వెంటనే మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. పశుసంవర్ధకశాఖ ఏడీ మనోహర్ వివరణ కోరగా మరమ్మతుల నిర్వహణకు ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

